ప్రజాశక్తి
బుధవారం 30 ఏప్రిల్ 2025
5
శ్రీకాకుళం



సీనియార్టీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

శ్రీకాకుళం : ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని జెడ్‌పి, మున్సిపల్ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి కల్పించడానికి సీనియార్టీ జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాపై అభ్యంతరాలు ఉంటే మే రెండో తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా తెలియజేయాలని సూచించారు. తొలి విడతలో వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించి స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన కేటగిరీల సీనియార్టీ జాబితా పొందుపరిచినట్లు తెలిపారు. వెబ్‌సైట్ లింక్ https://www.sites.google.com/site/deoskl.orgలో ఉన్న సీనియార్టీ జాబితా సందర్శించాలని సూచించారు. గడువు దాటి వచ్చిన అభ్యంతరాలను స్వీకరించబోమని స్పష్టం చేశారు.

గృహ యోగం ఎప్పుడో..?

- పేదలకు ఇళ్లపై అక్టోబరులో పిఎంఎవై సర్వే
- ఇప్పటివరకు 53,247 అర్హులు గుర్తింపు
- అందులో ఇళ్లు లేని పేదలు 6,629
- స్థలం ఉండి ఇళ్లు లేని వారు 44,265 మంది


సర్వే చేస్తున్న సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది (ఫైల్)

ఇళ్లు లేని పేదలందరికీ గృహాలు నిర్మించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఇందుకోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ (పిఎంఎవై-యు) పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. లబ్ధిదారుల గుర్తింపుపై గతేడాది అక్టోబరులో గృహనిర్మాణ శాఖ సర్వే చేపట్టింది. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా ఇళ్లు లేని వారు 53,247 మంది ఉన్నట్లు గుర్తించారు. సర్వే సందర్భంగా తప్పిపోయిన వారు, గ్రామాల్లో ఇంకా ఎవరైనా ఇళ్లు కావాల్సిన ఉండవచ్చన్న అంచనాతో ప్రస్తుతం సర్వేను కొనసాగిస్తున్నారు. లబ్ధిదారుల్లో ఇళ్లు లేని పేదలతో పాటు సొంత స్థలం ఉండి ఇళ్లు లేని పేదలను గుర్తించారు. జిల్లాలో ఆరు నెలలుగా సర్వే చేస్తున్నా, ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేయకపోవడంతో లబ్ధిదారులకు ఎదురుచూపులే మిగిలాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద ఆర్థికంగా వెనుకబడిన, తక్కువ ఆదాయం తరగతి (ఎల్ఐజి), ఎక్కువ ఆదాయం తరగతి (ఎంఐజి) కేటగిరీల్లో ఉన్న అర్బన్ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థికసాయం అందించాలని రెండు ప్రభుత్వాలు నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందుకయ్యే ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60 : 40 నిష్పత్తిలో నిధులను వెచ్చించనున్నాయి. జిల్లావ్యాప్తంగా శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) పరిధిలోకి రావడంతో ఈ పథకం అన్ని మండలాలకు వర్తింపజేసింది. పథకం కింద ఎంపికైన లబ్ధిదారునికి బెనిఫిషియరీ లెడ్ కన్‌స్ట్రక్షన్ (బిఎల్‌సి) కేటగిరీలో ఇంటి నిర్మాణం కోసం రూ.2.50 లక్షలు ఆర్థికసాయం అందించనుంది. అందులో కేంద్రం వాటా రూ.1.50 లక్షలు కాగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఇవ్వనుంది. సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునేందుకు ముందుకొచ్చే వారు గ్రామ, వార్డు సచివాలయాల్లో స్థలాలకు సంబంధించిన పత్రాలను, భార్యాభర్తల ఆధార్ కార్డులు, సామాజిక తరగతి ధ్రువీకరణ, రేషన్‌కార్డు పత్రాల వివరాలను నమోదు చేశారు. గతంలో తమ పేర్లతో ఎటువంటి గృహ నిర్మాణ పథకం కింద ఇల్లు మంజూరు కాని వారికి మాత్రమే ఇళ్లు మంజూరు చేశారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న తర్వాత వాటిని తమ పరిధిలోని గృహనిర్మాణ శాఖ ఎఇకి అందించారు. ఇందులో ప్రధానంగా పిఎం స్వనిధి, పిఎం విశ్వకర్మ, సఫాయి కర్మచారి, అంగన్‌వాడీ వర్కర్స్, భవన నిర్మాణ కార్మికులు ఇతర గుర్తించిన తరగతులకు ప్రాధాన్యం ఇచ్చారు.

● 53,247 మంది లబ్ధిదారుల గుర్తింపు

పిఎంఎవై అర్బన్ 2.0 పథకం కోసం గతేడాది అక్టోబరులో సర్వే చేపట్టారు. గ్రామాల్లో గృహనిర్మాణ శాఖ అధికారులు, పట్టణాల్లో మున్సిపల్ అధికారులు పర్యవేక్షించారు. గృహనిర్మాణ శాఖ, సచివాలయ సిబ్బంది సర్వే నిర్వహించారు. సర్వేలో ఇప్పటివరకు 53,247 మందిని ఇళ్లు లేని పేదలుగా గుర్తించారు. ఇందులో 51,479 గ్రామీణ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులు, 1768 మంది పట్టణ పరిధిలోని పేదలు ఉన్నారు.

రణస్థలం మండలంలో అత్యధికంగా 2,952 మంది గ్రామీణ పేదలకు ఇళ్లు లేనట్లు సర్వేలో గుర్తించారు. జలుమూరు మండలంలో 2,185 మందికి, పోలాకిలో 2,143 మంది ఇళ్లు లేని పేదలు ఉన్నట్లు గుర్తించారు. గార మండలంలో 1,889 మంది, కవిటిలో 2,161 మంది, కంచిలిలో 1,966 మంది గ్రామీణ పేదలకు ఇళ్లు లేనట్లు గుర్తించారు. ఎచ్చెర్లలో 2,490 మందికి, సారవకోటలో 1,852 మందికి, నరసన్నపేటలో 2,422 మందికి ఇళ్లు అవసరమైనట్లుగా సర్వేలో గుర్తించారు. హిరమండలంలో అత్యల్పంగా 833 మంది మాత్రమే ఇళ్లు కోరుకున్నట్లుగా తెలుస్తోంది. ఎల్.ఎన్ పేటలో 860 మందికి, మెళియాపుట్టిలో 959 మందికి, ఇచ్ఛాపురంలో 911 మందికి ఇళ్లు లేనట్లుగా సర్వేలో తేలింది.

● అర్బన్ ప్రాంతాల్లో 818 మంది గుర్తింపు

జిల్లాలో నాలుగు అర్బన్ ప్రాంతాల్లో కలిపి మొత్తం 1,768 మందికి గృహాలు లేనట్లు సర్వేలో గుర్తించారు. శ్రీకాకుళం అర్బన్‌లో 563 మంది తమకు ఇళ్లు కావాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆమదాలవలస అర్బన్‌లో 569 మందికి ఇళ్లు లేనట్లు తేలింది. ఇచ్ఛాపురంలో 180 మందికి, పలాస-కాశీబుగ్గలో 456 మందికి ఇళ్లు లేనట్లు గుర్తించారు.

● ఇళ్ల స్థలం లేని వారు 5,760 మందిగా గుర్తింపు

జిల్లాలో ఇళ్లు లేని పేదలుగా గుర్తించిన 53,247 మందిలో 1,768 మందికి కనీసం ఇంటి స్థలమూ లేనట్లు గుర్తించారు. నరసన్నపేటలో అత్యధికంగా 1,072 మంది స్థలం లేని పేదలుగా తేలారు. జలుమూరులో 678 మందికి స్థలం లేదు. ఎచ్చెర్లలో 467 మందికి, పాతపట్నంలో 359 మందికి, పొందూరులో 436 మందికి, పోలాకిలో 462 మందికి, సరుబుజ్జిలిలో 309 మందికి ఇళ్లస్థలాలు లేనట్లు గుర్తించారు. కంచిలిలో 1,966 మందికి సొంత స్థలం ఉండి ఇళ్లు లేని వారు ఉన్నట్లు గుర్తించారు. కవిటిలో 2,161 మంది, సంతబొమ్మాళి మండలంలో 1,274 మందికి సొంత స్థలం ఉన్నా ఇళ్లు లేనట్లుగా తేలింది.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

4న నీట్ పరీక్ష

- అన్ని శాఖల సమన్వయంతో నిర్వహణ
- జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మే నాలుగో తేదీన నిర్వహించే నీట్ పరీక్షకు అన్ని శాఖల సమన్వయంతో సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావుతో కలిసి నీట్ పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో ఆర్‌జెయుకెటి ఎచ్చెర్ల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ గుజరాతీపేట, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల శ్రీకాకుళం, కేంద్రీయ విద్యాలయం శ్రీకాకుళం ఉన్నాయన్నారు. నాలుగో తేదీ మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే కేంద్రాల్లోకి ప్రవేశం కల్పిస్తారని, ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ప్రతి అభ్యర్థి హాల్ టికెట్‌లో పొందుపరిచిన నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు. ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. ప్రతి కేంద్రంలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులను ఆదేశించారు. జనరేటర్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

ప్రతి కేంద్రంలో వైద్య సిబ్బంది, అత్యవసర మందులతో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థుల రవాణా కోసం తగిన బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ కిరణ్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్, నీట్ సిటీ కోఆర్డినేటర్ సుహాయిబ్ ఆలం, చీఫ్ సూపరింటెండెంట్ పి.వి రమణమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఒడిశా గవర్నర్ పర్యటన

ప్రజాశక్తి - కవిటి

ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు వ్యక్తిగత పర్యటనలో భాగంగా కంచిలి మండలంలో మంగళవారం పర్యటించారు. తహశీల్దార్ రమేష్ కుమార్, ఎంపిడిఒ తిరుమలరావు, స్థానిక నాయకులు పిరియా అబ్బాయి నాయుడు, జగదీష్ పట్నాయక్ ఆయనకు స్వాగతం పలికారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. పర్యటనలో భాగంగా కంచిలి మండలం ఎం.ఎస్ పల్లి దగ్గర దాళేశ్వరంలోని సోలార్ పవర్ గ్రిడ్‌ను గవర్నర్ పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


స్వాగతం పలుకుతున్న అబ్బాయి నాయుడు, జగదీష్ పట్నాయక్


పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

అటవీ శాఖ పనులపై విజిలెన్స్ విచారణ

ప్రజాశక్తి - మందస

అటవీ శాఖ చేపట్టిన పలు పనులపై విజిలెన్స్ విచారణ ప్రారంభమైంది. విజిలెన్స్ డిజి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా, అమలు విభాగం ఎస్‌పి బి.ప్రసాదరావు పర్యవేక్షణలో కాశీబుగ్గ రేంజ్, మందస సెక్షన్‌కు సంబంధించి పలు పనులను మంగళవారం పరిశీలించారు. అటవీ శాఖ చేపట్టిన మొక్కల పెంపకం, ట్రెంచ్ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. రికార్డుల్లో పేర్కొన్న విధంగా పనులు చేపట్టారా?, లేదా? అన్న అంశాలను పరిశీలించారు. తనిఖీల అనంతరం పూర్తి నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. విజిలెన్స్ శాఖ డిఎస్‌పి వై.గోవిందరావు, డిఇ సత్యనారాయణ, అసిస్టెంట్ జియాలజిస్ట్ సురేష్ కుమార్, ఎఇ గణేష్, కాశీబుగ్గ అటవీ రేంజ్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ సాయి ప్రత్యూష

నిబంధనలకు అనుగుణంగా ఓటర్ల జాబితా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఓటర్ల జాబితాను నిబంధనలకు అనుగుణంగా కచ్చితత్వంతో తయారు చేయాలని శ్రీకాకుళం నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి, ఆర్‌డిఒ కె.సాయి ప్రత్యూష సూచించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శ్రీకాకుళం నియోజకవర్గానికి చెందిన బూత్ స్థాయి అధికారులతో మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. మరణించిన, వివాహమై వేరే ప్రాంతానికి వెళ్లిన, రెండుసార్లు నమోదైన ఓట్లను గుర్తించి తొలగించాలని ఆదేశించారు. ఓటర్ల వివరాల నిర్వహణ కోసం బూత్ స్థాయి అధికారుల మొబైల్ అనువర్తనం, ఇఆర్ఒ నెట్ వంటి వ్యవస్థల వినియోగంపై అవగాహన సాధించాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ ఎస్.గణపతిరావు, ఉప తహశీల్దార్ జి.కె శ్రీనివాసరావు, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

పశువుల మృతిపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని పశువులు మృత్యువాతపై విచారణ చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలోని అన్నంపేటలో పి.రంగారావుకు చెందిన నాలుగు ఆవులు అనారోగ్యానికి సోమవారం మృత్యువాత పడ్డాయని అన్నారు. దీంతో రూ.3 లక్షల వరకు నష్టపోయారని తెలిపారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ప్రయివేట్ వైద్యునితో చికిత్స చేశారని అన్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి పశువుల మృతిపై విచారణ చేపట్టి కారణాలను వెలికితీయాలన్నారు. అలాగే నష్టపోయిన రైతుకు పరిహారం అందించాలన్నారు.

3, 4 తేదీల్లో బీచ్ ఫెస్టివల్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

బారువ బీచ్ ఫెస్టివల్‌ను మే 3, 4 తేదీల్లో కొనసాగించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి జిల్లాస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్ స్పోర్ట్స్, సంప్రదాయ బీచ్ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో బీచ్ ఫెస్టివల్ ప్రత్యేకంగా ఉండాలన్నారు. సందర్శకులకు తాగునీరు, మరుగుదొడ్లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మే ఒకటో తేదీన పెన్షన్ పంపిణీ పకడ్బందీగా ఉండేలా చూడాలన్నారు. బుధవారం నాటికి డబ్బులు విత్‌డ్రా చేసుకుని సిద్ధంగా ఉండాలన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఎప్పటిలాగే పనిచేస్తుందని వివరించారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించిన ఇళ్ల వివరాలు, అనుమతులు లేని లే అవుట్ల సమాచారం శుక్రవారం నాటికి తప్పనిసరిగా అందజేయాలన్నారు. రీ సర్వేలో కనీసం పది శాతం క్షేత్రస్థాయిలో అధికారులే పరిశీలించాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లు, గ్రామీణ నీటిపారుదల అధికారులకు సూచించారు. గోకులం షెడ్ల నిర్మాణం వెంటనే పూర్తి చేసి, పశువులకు నీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఫామ్ పాండ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్షలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ పద్మావతి, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

ఉగ్ర దాడి హేయమైన చర్య

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి అన్నారు. ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద నిరసన తెలిపారు. మృతులకు నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రవాదుల కాల్పుల్లో 26 మంది అమాయకులు ప్రాణాలు పోగొట్టుకున్నారని, ఈ ఘటనను యుటిఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేస్తోందన్నారు. ఉగ్రవాదులు సరిహద్దులు దాటి దేశంలోకి చొరబడకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలన్నారు.

యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో భారతీయులంతా ఐక్యంగా నిలవాలన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిని దూరంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బి.ధనలక్ష్మి, జిల్లా కోశాధికారి బి.రవికుమార్, జిల్లా కార్యదర్శి పి.సూర్యప్రకాష్, మహిళా విభాగం జిల్లా కన్వీనర్ కోరాడ శాంతిప్రియ, జిల్లా కమిటీ సభ్యులు ఎల్ కోదండరామయ్య, టి.వైకుంఠరావు, పి.చిన్నారావు, మాలతి తదితరులు పాల్గొన్నారు.

డిసిసిబి బలోపేతానికి కృషి

డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ

ప్రజాశక్తి - ఆమదాలవలస


జిల్లా సహకార కేంద్ర బ్యాంకు బలోపేతానికి కృషి చేస్తానని డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సహకార బ్యాంకు ద్వారా జిల్లాలో రైతులకు మరిన్ని మెరుగైన పథకాలు అందిస్తామన్నారు. సహకార బ్యాంకును అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లి రైతుల అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తానని తెలిపారు. భౌగోళిక పరిస్థితులు, లోటుపాట్లను క్షుణ్ణంగా అధ్యయనం చేసి సహకార బ్యాంకు అభివృద్ధి, రైతుల ప్రయోజనాలకు బాటలు వేస్తానన్నారు. టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీని నమ్ముకున్న తనను గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అందరి మన్ననలు పొందుతానన్నారు. మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో తూర్పు కాపులకు తెలుగుదేశం పార్టీ గుర్తించి సముచిత స్థానం కల్పించిందన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు పల్లి సురేష్, నందివాడ గోవిందరావు, ఆనెపు రామకృష్ణ, రాంజీ, తాడేల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిసిసిబి చైర్మన్ సూర్యనారాయణ

మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యం

ప్రజాశక్తి - గార

మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గార మండలంలోని బలరాంపురంలో మత్స్యకారుల సేవలో పథకాన్ని మంగళవారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ సమయంలో భృతి కింద మత్స్యకారులకు రూ.20 వేలు అందజేశామని తెలిపారు. వైసిపి ఐదేళ్ల అరాచక పాలనలో సబ్సిడీలను రద్దు చేసి మత్స్యకారులకు ద్రోహం చేశారని మండిపడ్డారు. మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచే దిశగా చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కొందరు లబ్ధిదారులకు భరోసా అందలేదని ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని పరిశీలించి త్వరలోనే వారికి అందజేస్తామని చెప్పారు. ముందుగా సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి, మత్స్యకారులకు మత్స్యకారులు భరోసా అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు, ప్రజలు, మత్స్యకారులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

శివారు భూములకు నీరందించాలి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి శివారు భూములకు సాగునీరందించాలని ఎపి రైతుసంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని తోటపాలెం, కొత్తపేట, సెగిడిపేట, అంబేద్కర్ నగర్, ముద్దాడ, రుప్పపేట, రామజోగిపేట గ్రామాల్లో రైతుసంఘం, కౌలు రైతుసంఘం, నారాయణపురం కుడి ప్రధాన కాలువ టైలాండ్ ఏరియా రైతు ప్రతినిధులు మంగళవారం పర్యటించారు. అనంతరం రైతులతో కలిసి రామజోగిపేట వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నారాయణపురం కుడి కాలువ ద్వారా శివారు భూములకు వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి సాగునీరు అందించేందుకు అవసరమైన ఆధునీకీకరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి సాగునీరందించాలని కోరుతూ ఈనెల రెండో తేదీన రైతు, కౌలురైతు సంఘాల ఆధ్వర్యాన జీపు జాతాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాతాను మండలంలోని పూడివలస వద్ద రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ ఉదయం ఏడు గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు. రెండు రోజుల పాటు చేపట్టే జాతాను జయప్రదం చేయాలని కోరారు. సాగునీటి సమస్యలపై మే ఏడో తేదీన కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు వెలమల రమణ, అల్లు సూర్యనారాయణ, అరసవల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతుసంఘం నాయకులు, రైతులు

జాతీయ పోటీల విజేతలు వీరే

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఈనెల 24న జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ స్థాయి పోటీలను ఆన్‌లైన్‌లో నిర్వహించినట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల, ఆలిండియా స్టూడెంట్స్ యూనియన్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ యూత్ అసోసియేషన్లు సంయుక్తంగా ఈ పోటీలను లెవల్-1, లెవల్-2లుగా (6 నుండి 12, డిగ్రీ, ఆపైన) నిర్వహించగా 345 మంది పాల్గొన్నారన్నారు. పోటీల్లో భాగంగా క్విజ్, డిజిటల్ పోస్టర్ మేకింగ్, ఎస్సేరైటింగ్, స్లోగన్ రైటింగ్, ఎవేర్నెస్ రీల్స్ విభాగాల్లో ఈ పోటీలు చేపట్టామన్నారు. జాతీయ స్థాయి పోటీల విజేతలుగా ఐతమ్ విద్యార్థులు డాకర జ్ఞానేశ్వరి, వీరభద్రా ఊట్లతో పాటు యుపి, వెస్ట్బెంగాల్, రాజస్థాన్, ఢిల్లీ, పాట్నా, బీహార్‌కు చెందిన 16 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. వీరికి ప్రశంసాపత్రాలను అందజేస్తామన్నారు. ఈ పోటీలను ఎఐఎసు జాతీయ అధ్యక్షులు దిగంబర్ కుమార్ దుబే, ఉపాధ్యక్షులు ఎం.సాయికృష్ణ, ఐతమ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్. శ్రీనివాసరావు, శాక్ ఈవెంట్ కో-ఆర్డినేటర్ సురేష్‌కుమార్ పర్యవేక్షణ చేశారని తెలిపారు.

ఎమ్మెల్యే శిరీషతోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు


మాట్లాడుతున్న రమేష్

పలాస నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్యే గౌతు శిరీషతోనే సాధ్యమని మండలంలోని కొండవూరు మాజీ సర్పంచ్, మండల టిడిపి నాయకుడు కొల్లి రమేష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వైసిపి ఐదేళ్ల పాలనలో వంశధార శివారు భూములకు చుక్క నీరు అందించలేదని అన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే వంశధార నీరు అందించి రైతులతో శభాష్ అనిపించుకున్నారని పేర్కొన్నారు. గౌతు కుటుంబాన్ని విమర్శించే స్థాయి, అర్హత అప్పలరాజుకు లేదన్నారు. మత్స్యకార కుటుంబం నుంచి వచ్చిన అప్పలరాజు మత్స్యకారులకు చేసిన మేలు ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. సిఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మత్స్యకార భరోసా రూ.20 వేలుకు పెంచి శ్రీకాకుళం జిల్లా నుంచే పంపిణీ చేశారని గుర్తు చేశారు. కేంద్రీయ విద్యాలయం కోసం భూసేకరణ చేస్తే అవగాహన రాహిత్యంతో అవాకులు, చవాకులు పేలిన అప్పలరాజు కేంద్ర బృందం పరిశీలించి కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చర్యలు తీసుకుంటుంటే ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

వదిలేసిన పనులు పూర్తి చేస్తున్నాం

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో పలు అభివృద్ధి పనులకు కొబ్బరికాయలు కొట్టి విడిచిపెట్టేసిందని, ఎమ్మెల్యే గౌతు శిరీష అధికారంలోనికి వచ్చిన తరువాత వదిలేసిన పనులను దగ్గరుండి పూర్తిచేయిస్తున్నామని క్లస్టర్ 1 ఇన్‌ఛార్జి, బిసిసెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు పెద్దబ్రాహ్మణవీధిలో చేపడుతున్న రోడ్డు పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తామని మాయమాటలు చెబుతూ ప్రతివార్డులో ఎన్నో పనులకు కొబ్బరికాయలు కొట్టి పనులు చేయకుండా వదిలేశారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర్ త్యాడి పాల్గొన్నారు.

మేడేను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- పోలాకి


పోలాకి : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

కార్మికవర్గ దీక్షాదినం మేడేను విజయవంతం చేయాలని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు పోలాకి మేడే పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడే సందర్భంగా జెండా ఆవిష్కరించాలన్నారు. మే 20న అఖిలభారత సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ధరల పెరుగుదల, అవసరాలు దృష్టిలో పెట్టుకొని కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలన్నారు. అంగన్వాడీ, ఆశ తదితర స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. యాప్‌లు, పనిభారాలు తగ్గించాలన్నారు. కూటమి ప్రభుత్వం అంగన్వాడీ, ఆశాలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడి నాయకత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసం 4 లేబర్ కోడ్‌లుగా మార్చి వేసిందన్నారు. కార్మిక సంఘాలను బలహీనం చేసి శ్రమ దోపిడీని మరింత పెంచుకోవడానికి, యజమానుల దోపిడీని, అక్రమ తొలగింపులను, పనిభారాన్ని ప్రశ్నించే పరిస్థితి లేకుండా చేయడానికి, పని గంటలు పెంచడానికి లేబర్ కోడ్‌లు తెచ్చారని అన్నారు. ఉద్యోగులను, కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చేవిధంగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు తెచ్చిందని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతూ కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తూ కార్మిక, కర్షకులకు ద్రోహం చేస్తుందని అన్నారు. సమావేశంలో పోలాకి మండల కళాసీ కార్మిక సంఘం నాయకులు పి.శ్రీనివాసరావు, వి.గోవిందరావు, డి.ప్రసాద్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు టి.దమయంతి, వై.శైలజ, జి.కృష్ణవేణి, కె.హైమావతి, వి.రాజేశ్వరి, పి.లక్ష్మీకాంతం, జి.రమణమ్మ, బి.సుగుణ పాల్గొన్నారు.

జలుమూరు : మండల కేంద్రంలోని మేడే, అఖిల భారత సమ్మె విజయవంతంపై సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.కొండయ్యలు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు డి.మాలతి, ఆశా యూనియన్ నాయకులు సిహెచ్.లత, జి.దేవి, ఎస్.ఉమ, ఎస్.పద్మ, ఆర్.ఆదిలక్ష్మి, కె.రాజేశ్వరి పాల్గొన్నారు.

శ్రీకాకుళం : నగరంలోని డైమండ్ పార్కు నుంచి మేడే ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని, ఏడు రోడ్ల కూడలి వరకు కార్మికుల ర్యాలీ నిర్వహిస్తున్నట్టు సిఐటియు టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు తెలిపారు. రిమ్స్ కార్మికులతో మేడే, అఖిల భారత సమ్మె విజయవంతంపై పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కె.రవి, సంతు, టి.కుమారి, బి.సూరిడమ్మ, సిహెచ్.మీనాకుమారి పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : స్థానిక సిఐటియు కార్యాలయంలో మేడే, అఖిల భారత సమ్మె విజయవంతం పోస్టర్లను సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ ఆవిష్కరించారు. సమావేశంలో పి.దుర్గాప్రసాద్, మన్యం రమణ, రామప్పడు, అంబటి సత్యన్నారాయణ, తమ్మినేని రవి, బి.కనకం, ఎస్.అమృత, పి.పుష్పలత, కొండమ్మ పాల్గొన్నారు.

కమిషనర్ చర్యలు చట్ట వ్యతిరేకం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం


స్వర్ణమణి

'నా మున్సిపల్ కౌన్సిలర్ సభ్యత్వం, అనర్హత విషయంలో కమిషనర్ రమేష్ పూర్తిగా చట్టవ్యతిరేకమైన చర్యలకు పాల్పడుతున్నారని' అనర్హతకు గురైన వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి ఒక ప్రకటనలో ఆరోపించారు. కౌన్సిల్ తీర్మానం నంబరు 472, తేదీ 29-03-2025న అనర్హత విషయంలో చట్టపరమైన తదుపరి చర్యలు తీసుకోవడానికి ఆమోదం అడిగారన్నారు. ఆ అంశంపై కౌన్సిల్‌లో మాట్లాడుతూ ఆమోదం తీసుకున్న తరువాత ప్రభుత్వం ఆమోదానికి రాస్తామని కౌన్సిల్‌కి చెప్పారన్నారు. ఇప్పుడు కౌన్సిల్ తీర్మానం చేస్తే... సభ్యత్వం రద్దు అవుతుందని కొత్త వాదన చెబుతున్నారని పేర్కొన్నారు. వరుసగా మూడు సమావేశాలకు సభ్యుడు రాని పక్షంలో మాత్రమే తీర్మానం ద్వారా రద్దు చేయవచ్చునని అన్నారు. వరుస సమావేశాలు విషయంలో అభ్యంతరం వచ్చినప్పుడూ జిల్లా జడ్జి నిర్ణయం తీసుకోవాలన్నారు. 'నాపై చేసిన అభియోగాలు జిల్లా జడ్జి వద్ద నిరూపణ జరిగినప్పుడే నా సభ్యత్వం రద్దు అవుతుంది తప్ప, కౌన్సిల్ తీర్మానం చేసినంత మాత్రాన అవ్వదని' అన్నారు. కౌన్సిల్ తీర్మానంతో సభ్యత్వం రద్దవుతుందని భావిస్తే కౌన్సిల్‌లో మెజారిటీ ఉన్న పార్టీ ప్రతిపక్ష సభ్యులను తీర్మానం ద్వారా సభ్యత్వం రద్దు చేసేయువచ్చునని తెలిపారు. అటువంటి పరిస్థితి ఉంటే ఎన్నికలు పెట్టడం దండగే కదా? నిజంగా వాళ్లు చెప్పినట్టు నా సభ్యత్వం రద్దు అయినట్టైతే 7వ వార్డుకి, వైస్ చైర్మన్ పదవికి ఎన్నికలు నిర్వహించాలని వెంటనే ఎన్నికల కమిషన్‌ని కోరవచ్చు కదా? అని ప్రశ్నించారు. కౌన్సిల్ తీర్మానం ద్వారా సభ్యత్వం రద్దు అనే రూల్ ఎక్కడా లేదన్నారు. కౌన్సిలర్ అనర్హత నిర్ణయించేది జిల్లా జడ్జి మాత్రమే అన్నారు. నా అనర్హత విషయంలో చట్టవ్యతిరేకమైన చర్యలు తీసుకుంటున్న మున్సిపల్ కమినర్, ఇతర సిబ్బందిపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

కౌన్సిలర్ అనర్హతపై రగులుతున్న వివాదం

ఇచ్ఛాపురం మున్సిపల్ కౌన్సిలర్ అనర్హతపై బాధిత కౌన్సిలర్, వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి, మున్సిపల్ కమిషనర్ మధ్య ప్రకటనలు యుద్ధం మొదలైంది. తన అనర్హతపై కౌన్సెల్ తీర్మానం చేసిన తీరు నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని, ఇంకా రద్దు చేసినట్లు ఎటువంటి ఉత్తర్వులు జారీ కాలేదని, కాబట్టి కౌన్సెల్ సాధారణ సమావేశంలో ఎజెండా ఇవ్వాలని ఇటీవల స్వర్ణమణి వినతి పత్రం అందజేశారు.

దీనిపై మున్సిపల్ కమిషనర్ పేరుతో మంగళవారం మరో వివరణతో ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ నిబంధనల ప్రకారమే చేశామని, ఎక్కడా నిబంధనలు ఉల్లగించలేదని వివరణ ఇచ్చారు. నోటీసు చట్టపరమైన సందర్భాలు తప్పుడు వివరణలతో ఉందని తెలియజేయడానికి ఎపి ఎం చట్టం సి 1965లో సెక్షన్ 17(1)బి స్పష్టంగా చెపుతుందన్నారు. ఈ విషయాన్ని కౌన్సెల్ ముందు ఉంచిన తేదీ నుంచి రెండు నెలలు వ్యవధిలోపు కౌన్సెల్ గాని ప్రభుత్వం నుంచి ఎలాంటి నోటీసు ఆదేశాలు ఇవ్వకపోతే జిల్లా న్యాయమూర్తి నిర్ణయానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇక్కడ మున్సిపల్ కౌన్సెల్ అనర్హత ప్రవేశాన్ని ఆమోదిస్తూ... తన తీర్మానం ఆమోదం చేయడం ద్వారా స్పష్టంగా ఉందన్నారు. ఎపి ఎం చట్టం సి 1965 ప్రకారం సెక్షన్ 59 ప్రకారం ఏదైనా తీర్మానం రద్దు చేయడానికి నిలిపివేయడానికి ప్రభుత్వానికి అధికారం ఉందని వివరణ ఇచ్చారు.


శిక్షణలో పాల్గొన్న మహిళలు

స్వయం ఉపాధి కల్పనకు చర్యలు

ప్రజాశక్తి- హిరమండలం

మహిళల స్వయం ఉపాధి కల్పనకు కూటమి ప్రభుత్వం తీసుకుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు నెలల పాటు శిక్షణ పొందిన తర్వాత ఉచితంగా కుట్టు మిషన్లు అందిస్తామన్నారు. అనంతరం మహిళలు టీం సభ్యులుగా ఏర్పడి పారిశ్రామికంగా అభివృద్ధి చెందవచ్చునని పేర్కొన్నారు. రోజుకు నాలుగు గంటల పాటు టైలరింగ్ శిక్షణ అందిస్తున్నామన్నారు. ఈ పథకం ద్వారా మహిళలు స్వయం ఉపాధిని పొందడమే కాకుండా, వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి ఆర్థికంగా స్థిరపడవచ్చని కొనియాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తూలుగు తిరుపతిరావు, ఎంఇఒ రాంబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన తిలక్


జగన్‌తో తిలక్

టెక్కలి రూరల్ : మాజీ సిఎం వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డిని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ కలిశారు. తాడేపల్లిగూడెంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఇటీవల టెక్కలి నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలపై చర్చించారు. టెక్కలి నియోజకవర్గంలో వైసిపి కమిటీల నియామకం పరిస్థితులను వివరించారు. ఇటీవల ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేసిన క్రమంలో తిలక్ కలవడంపై పలువురు చర్చించుకుంటున్నారు.

సరస్వతికి అభినందనలు


సరస్వతి

ఇచ్ఛాపురం: స్థానిక మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో చదువుతున్న ఇచ్ఛాపురానికి చెందిన రేయ్య సరస్వతి ఖోఖో పోటీలో ప్రతిభ కనబరిచి అనేక బంగారు పతకాలు సాధించింది. ఈ నెల 30 నుంచి మే 4 వరకు ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయస్థాయి ఖోఖో పోటీలకు పయనమయ్యారు. ఇప్పటివరకు ఎనిమిది నేషనల్స్ పోటీల్లో పాల్గొంది. 12 స్టేట్ టోర్నమెంట్ పాల్గొని ఒక గోల్డ్, మూడు సిల్వర్‌లు మెడల్స్ సాధించింది. సర్వసతికి ప్రధానోపాధ్యాయులు పి.వి.రమణమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

సిఎం ప్రకటనలు అవాస్తవం

శ్రీకాకుళం రూరల్: ఎన్నికల సమయంలో టిడిపి అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బూటకపు హామీలు ఇచ్చి గెలుపొందారని, ఆ హామీలన్నీ అవాస్తమని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో అన్నీ మోసపూరిత విధానాలతో కూడిన మాటలే చెప్పారని అన్నారు. మత్స్యకార భరోసా అంటూ రూ.20 వేలు చొప్పున ఏడాదికి వేట నిషేధ సమయంలో ఇస్తామని చెప్పి, తరువాత అధికారంలోకి రాగానే ఒక సీజన్‌కు సంబంధిత మొత్తం చెల్లించక మాట దాట వేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని వ్యాఖ్యానించారు.


మొక్కను నాటుతున్న కృష్ణంరాజు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

పలాస : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని టిడిపి నాయకులు, శ్రీశయన రాష్ట్ర నాయకులు బూరెల కృష్ణంరాజు అన్నారు. మండలంలోని జయకృష్ణపురంలో మంగళవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటడం అవసరమని, మొక్కలు నాటడం ద్వారా ప్రయాణికులకు ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు. స్వచ్ఛమైన ప్రాణవాయువు లభిస్తుందన్నారు. ప్రతిఒక్కరూ పుట్టిన రోజు, తమ కుటుంబ సభ్యుల వర్ధంతులను పురస్కరించుకుని మొక్కలు నాటడం వల్ల పర్యావరణానికి మేలు చేకూరుతుందని అన్నారు. 600 మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇలా ప్రతి పండగ, పర్వదినాలు రోజున మొక్కలు నాటుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

గణితం ఇంజినీరింగ్‌కు బలమైన పునాది

నరసన్నపేట : గణితంలో బలమైన పట్టు ఎంసెట్‌లో విజయానికి దోహదపడుతుందని, ఇంజినీరింగ్ విద్యకు బలమైన పునాదిని అందిస్తుందని గణిత అధ్యాపకులు డాక్టర్ బి.ఎల్.గణేష్ అన్నారు. స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో ఏ రోడ్ మ్యాప్ టు ఎంసెట్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబిఎస్ పుస్తకాలు చదవడం ద్వారా ప్రాథమిక అంశాలు తెలుస్తాయని తెలిపారు. గత ఐదేళ్ల ప్రశ్నపత్రాలను సాధన చేయాలన్నారు. స్థిరంగా, క్రమశిక్షణతో చదవాలన్నారు. చిన్న లక్ష్యాలు పెట్టుకుని వాటిని సాధించాలన్నారు. ఆత్మవిశ్వాసంతో పరీక్షకు హాజరవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న గణేష్

సక్రమంగా మార్పులు, చేర్పులు

జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజు

ప్రజాశక్తి- పాతపట్నం


పాతపట్నం : సమీక్షిస్తున్న జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజు

ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు సక్రమంగా నిర్వహించాలని జెడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.వి.శ్రీధర్‌రాజు అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో పలు రాజకీయ పార్టీ ప్రతినిదులతో ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, సవరణలపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణలో రాజకీయ పార్టీల నాయకులు బూత్ లెవెల్ ఏజెంట్లతో పాల్గొవాలని తెలియజేశారు. ఒక కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే దగ్గర ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మృతి చెందిన పేర్లను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ కిరణ్‌కుమార్, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని జెడ్‌పి సిఇఒ సందర్శించారు. హార్టికల్చర్ పంటలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు అనువైన స్థలాలపై ఆరా తీశారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహప్రసాద్ పండా, మండల పరిషత్ ఇఒ రాజేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ తిరుపతిరావు, భుజంగరావు పాల్గొన్నారు.

డిసిసిబి చైర్మన్‌కు శుభాకాంక్షలు


పుష్పగుచ్ఛం అందజేస్తున్న బ్యాంకు అధికారులు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డిసిసిబి) నూతన చైర్మన్‌గా నియమితులైన శివ్వాల సూర్యనారాయణకు బ్యాంకు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఆయన నివాసంలో షళంత్రిలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు సిఇఒ దత్తి సత్యనారాయణ, జనరల్ మేనేజర్లు వరప్రసాద్, జగదీష్, డిప్యూటీ జనరల్ మేనేజర్లు సత్యనారాయణ, రమేష్, సునీల్, బసవలింగం, ఎ.జి.యమ్స్ దశరథరామ్, ఆర్.కె. భాస్కరరావు, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు మురళీధర్, జనరల్ సెక్రటరీ కామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అంశాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- టెక్కలి

డిగ్రీ చదువుతున్న విద్యార్థులు తమ చదువులతోపాటు ఆర్థికపరమైన ఆంశాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని స్థానిక స్టేట్‌బ్యాంకు మేనేజర్ వై.సీతారామయ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆర్థిక వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యాన అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుకున్న కోర్సుల్లో ప్రాథమిక పరిచయం ఉంటుందని, వాటిని అవగాహన చేసుకుని తమ జీవితంలో ఎదిగేందుకు వినియోగించుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ మాట్లాడుతూ చదువుకున్న వారు ఎదిగి భవిష్యత్‌లో తాము ఉపాధి పొందుతూ ఇతరులకు ఉపాధిని కల్పించే దిశగా ఆలోచన చేయాలన్నారు. సమావేశంలో బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు, విభాగాల అధిపతులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

కట్టు తప్పిందో...


అధిక లోడుతో వెళ్తున్న వాహనం

కోటబొమ్మాళి: మండలం జాతీయ రహదారిలో నిమ్మాడ కూడలి నుంచి వాంగ్రాడకు మధ్యలో ఉన్న క్రాప్ వ్యాపారులు రానురానూ హెచ్చుమీరుతున్నారు. పిట్టకుంచం... కూత ఘనం అన్న చందాన చిన్నపాటి ఆటోలపై పరిమితకు మించి లారీలోడుకు తలదన్నే విధంగా సుమారు పది డుగుల ఎత్తుతో ఈ క్రాప్‌ను ఎక్కించుకొని జాతీయ రహదారిలో వెళ్తుంది. దీంతో వెనుక నుంచి వెళ్లే వాహనదారులపై ఈ లోడు పడి ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇటువంటి వాహనదారులు వద్ద రోడ్డు భద్రాత అధికారులు చిల్లర తీసుకొని చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇటువంటి వాహనాలపై దృష్టి సారించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఆటపాటలతో చిన్నారుల సందడి

ప్రజాశక్తి- శ్రీకాకుళం


శ్రీకాకుళం : పోటీలో పాల్గొన్న చిన్నారులు

జిల్లా గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా చిన్నారులు ఆట, పాటలతో సందడి చేశారు. సోడవరం ఈశ్వరరావు పర్యవేక్షణలో ఆటలు, పాటల పోటీలు, చిత్రలేఖనం, డాన్స్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార రాజా, ఉప గ్రంథాయాధికారి శంకరరావు, ఉపాధ్యాయులు కె.జె.రాజశేఖర్ పాల్గొని వేసవి శిక్షణ శిబిరం ప్రాధాన్యతను వివరిస్తూ... కళల్లో నైపుణ్యతను చక్కగా నేర్చుకోవాలని సూచించారు.

టెక్కలి : ఎవరైనా పుస్తకాలను చదవాలని స్థానిక అమ్మఒడి పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు ఎస్.రవికుమార్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.రూపవతి పాల్గొన్నారు.

లావేరు: వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా లావేరు శాఖాగ్రంథాలయంలో స్థానిక లిటిల్ స్కూల్ ప్రిన్సిపాల్, రిసోర్స్‌పర్సన్ టి. బాలరాజు విద్యార్థులకు మంగళవారం స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ ఇచ్చారు. ప్రాథమిక స్థాయి నుంచి ఇంగ్లీషులో నేర్చుకోవాన్నారు. చిన్నప్పటి నుంచే ఇంగ్లీష్ భాషలో మాట్లాడడం, రాయడం వంటివి విద్యార్థులు చేయాలన్నారు. అలాగే మాతృభాషతో పాటు జాతీయ అంతర్జాతీయ భాషలైన హిందీ ఆంగ్లంలో మాట్లాడడం చదవడం విద్యార్థులకు ఎంతైనా అవసరమని అన్నారు. ఈ వేసవి శిక్షణా శిబిరాలు విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఆంగ్లభాష వ్యాకరణ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : స్థానిక శాఖాగ్రంథాలయంలో ఉచిత వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా రెండో విద్యార్థులకు దినపత్రికలు చదివించడం, కథలు చెప్పామని గ్రంథాలయాధికారి ఆర్.అనురాధ తెలిపారు. అనంతరం క్యారమ్స్ ఆటలు పోటీలు పెట్టారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు హేమలత పాల్గొన్నారు.

డీలర్‌ను తొలగించాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న కార్డుదారులు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని డిపో నంబరు 34 లక్ష్మీపురం రేషన్ డీలర్ రమణమ్మను తొలగించాలని కార్డుదారులు డిమాండ్ చేశారు. రేషన్ సరుకులు సక్రమంగా అందించాలని నిరసిస్తూ లక్ష్మీపురం, రేగపాళెం గ్రామాలకు చెందిన కార్డుదారులు 30 ఆటోలపై మంగళవారం వచ్చి తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. డీలర్‌ను తక్షణమే తొలగించాలని నినాదాలు చేశారు. రెండు నెలలుగా తమకు రేసన్ సరుకులు సరఫరా చేయలేదని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. డీలర్ కార్డుకు రెండు కిలోల బియ్యం ఉంచుకుంటూ తూకం తక్కువగా ఇస్తూ సరుకులు దోచుకుంటున్నారని ఆరోపించారు. కార్డుదారులతో వేలిముద్రలు వేయించుకుని కందిపప్పు, పంచదార ఇవ్వకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని ఆరోపించారు. అంత్యోదయ కార్డులకు కిలో పంచదార ఇవ్వకుండా అరకిలో తాను కొట్టేసిందని ఒకలా కాకుండా అన్నివిధాలా ప్రజలను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ మంగం రాజశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో బోరపారోతి అసిరినాయుడు, గాలి రమణ, రమణమ్మ, అప్పయ్యమ్మ, అసిరితల్లి తదితరులు పాల్గొన్నారు.

'శివ్వాల'కు అభినందనలు

ప్రజాశక్తి- ఆమదాలవలస


పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ శివ్వాల సూర్యనారాయణను ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన రవికుమార్ అభినందించారు. మంగళవారం తనకు డిసిసిబి చైర్మన్‌గా అవకాశం కల్పించడంలో కీలక పాత్ర పోషించిన ఎమ్మెల్యే రవికుమార్‌ను శివ్వాల కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ డిసిసిబి చైర్మన్‌గా సిఎం నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చాలని అన్నారు. అనంతరం సూర్యనారాయణకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా తూర్పు కాపు సాధికార అధ్యక్షులు పల్లి సురేష్, టిడిపి నాయకులు చిన్నాల అప్పారావు, మీసాల రామారావు, కందుల వెంకట్రావు, గదిలి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

పెళ్లింట విషాదం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి


అప్పారావు (ఫైల్)

పెళ్లింట ఆ కుటుంబంలో పుట్టెడు దుఃఖం విషాదాన్ని మిగిల్చింది. కోలాహలంగా సందడి సందడిగా ఉండాల్సిన ఆ ఇంటి సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని మూలసవళాపురానికి చెందిన గూడాల అప్పారావు (57) తన భార్య కుమారితో కలిసి పలు గ్రామాల్లో పెళ్లి కార్డులు పంచుకొని సోమవారం రాత్రి తిరిగి బైక్‌పై వస్తున్నారు. అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఆ సమయంలో తేలికపాటి వర్షం, ఈదురు గాలులు వీయడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మండలంలోని కొత్తకోట కూడలి వద్దకు వచ్చేసరికి ఓ వ్యక్తి రోడ్డు దాటుకుంటూ మంద వద్దకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో చీకటిలో అతనిని తప్పించబోయే క్రమంలో ఆకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అప్పారావు తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన భార్య కుమారికి చిన్నచిన్న గాయాలయ్యాయి. క్షతగాత్రులను వైద్య చికిత్స నిమిత్తం 108 లో రాగోలు జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడు కుమారుడికి మే 13న వివాహం నిశ్చయించారు. కళ్లెదుటే భర్త మృతి చెందడంతో భార్య, కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడు భార్య ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ఎం.జనార్ధనరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ముకుందరావు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని కంద్రవీధికి చెందిన పూర్ణచంద్ర బెహరా (37) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... మృతుడు రాడ్ బెండింగ్ పనులు చేసేవాడు. మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోకుండా భార్యతో నిత్యం గొడవలు పడుతూ ఉండేవాడు. సోమవారం రాత్రి మద్యం తాగి ఇంటికి రావడంతో భార్యాభర్తలు ఘర్షణ పడ్డాడు. దీంతో మనస్తాపానికి గురైన పూర్ణచంద్ర బెహరా తన ఇంటి మధ్య గదిలో తనకు తానే నైలాన్ తాడును మెడకు చుట్టారు. గట్టిగా బిగించుకోగా... భార్య, తమ్ముడు వెంటనే కొన ఊపిరితో ఉన్న పూర్ణచంద్ర బెహరాను ఇచ్ఛాపురం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించగా, అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య రేవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్ఐ ముకుందరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కర్రసాముకు పూర్వవైభవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రాచీన యుద్ధకళ అయిన కర్రసాము విద్యకు పూర్వ వైభవాన్ని తీసుకురావాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు పిలుపు నిచ్చారు. స్టార్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన క్రీడాకారులకు మంగళవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతరించిపోతున్న ప్రాచీన క్రీడలకు పూర్వ వైభవాన్ని తీసుకురావల్సిన అవసరం ఉందన్నారు. పూర్వ ఆత్మరక్షణ కోసం కర్రసాము నేర్చుకొనే వారని గుర్తు చేశారు. జిల్లాలో కర్రసాము క్రీడకు ప్రాణం పోస్తున్న కోచ్ బలగ హర్షవర్ధన్‌ను అభినందించారు. ఈ నెల 30న పశ్చిమ గోదావరి జిల్లా కైకలూరులో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కర్రసాము పోటీల్లో పాల్గొంటారని అన్నారు. అంతకుముందు ఆర్ట్స్ కళాశాలకు నూతనంగా ప్రిన్సిపాల్ బాధ్యతలు చేపట్టిన ఆయనను స్టార్ వాకర్స్ ఆధ్వర్యాన సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, పి.జి.గుప్త, శాసపు జోగినాయుడు, బి.వి.రవిశంకర్, జి.లక్ష్మి, నళిని, సుధాకర్ పాల్గొన్నారు.


చిత్రపటాన్ని అందజేస్తున్న భద్రాజీ

అరసవల్లి సందర్శన

అరసవల్లి : సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఎమ్మెల్యేలు గొండు శ్రీనివాస్, గురజాల జగన్మోహన్ మంగళవారం దర్శించు కున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ కార్యనిర్వాహణాధికారి యర్రంశెట్టి భద్రాజీ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సూర్యనారాయణస్వామి చిత్రపటాన్ని అందజేశారు.


సమస్యలను విన్నవిస్తున్న గ్రామస్తులు

డ్రైనేజీని మెరుగుపర్చాలి

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పెసరపాడులో డ్రెయినేజీని మెరుగుపర్చాలని కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. ఈ మేరకు పెసరపాడును మంగళవారం సందర్శించారు. దీనితో ఆయన వద్ద తమ సమస్యలను మొరపెట్టుకున్నారు. గ్రామంలో రహదారి వ్యవస్థ బలంగా ఉన్నా.. డ్రెయినేజీ వ్యవస్థ ఇబ్బందికరంగా మారిందన్నారు. కాలువలు లేకపోవడంతో ఇళ్లలోనికి నేరుగా చేరడంతో, ఎక్కువడితే అక్కడ నీరు నిల్వ ఉండడంతో ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు. గ్రామంలో కాలువలు నిర్మించాలని కోరారు. దీనిపై కమిసనర్ స్పందించారు. ఆయనతో పాటు పట్టణ టిడిపి అధ్యక్షులు బడ్డ నాగరాజు, పెసరపాడు కాలనీ వాసులు ఉన్నారు.

కేన్సర్ బాధితునికి ఆర్థికసాయం

శ్రీకాకుళం: కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న గార మండలం అంపోలుకు చెందిన హేమంత్‌కుమార్‌కు మూడు నెలలకు సరిపడ నిత్యావసర సరుకులు, బియ్యం ప్యాకెట్, ప్రోటీన్ బాక్స్‌లను రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మంగళవారం అందజేశారు. డాక్టర్ హర్ష ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు దోశి శ్రావణ్ కుమార్ రెడ్‌క్రాస్ కార్యాలయంలో సరుకులను అందజేశారు. డాక్టర్ నిక్కు అప్పన్న, ఉర్దం శివతేజ పాల్గొన్నారు.


సరుకులను అందజేస్తున్న జగన్మోహనరావు

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం


దీక్ష చేస్తున్న ఆర్‌టిసి ఉద్యోగులు

ప్రజాశక్తి- పలాస

సమస్యలు పరిష్కరించేవరకు పోరాటం ఆగదని నేషనల్ మజ్దూర్ నాయకులు ఎం.జె.దేవ్, ఎస్.పార్వతీశం, ఎ.ఎ.నాయుడు స్పష్టం చేశారు. కాంప్లెక్స్ సమీపంలో చేపట్టిన రిలే నిరాహారదీక్ష మంగళవారానికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగేళ్లుగా నిలిచిన ఉద్యోగోన్నతులను కల్పించాలన్నారు. గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జిఒ ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఆర్‌టిసి విశ్రాంత ఉద్యోగుల దంపతులకు సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణాలను అనుమతించాలని కోరారు. కార్యక్రమంలో డి.శ్రీనివాసరావు, బి.పి.రావు, ఎన్.ధనంజయ, ఎం.పి.రావు, వి.ఎస్.రావు, జె.ఎస్.కుమార్, ఎల్.ఎల్.చారి, వి.ఇంద్ర, డి.సి.హెచ్.రావు, సెక్రటరీ ఎ.వి.రావు, కోశాధికారి డి.ఎస్.రావు, గ్యారేజీ సెక్రెటరీ డి.ఎల్.నారాయణ పాల్గొన్నారు.

చీకిటి ఎమ్మెల్యేతో కమిషనర్ భేటీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పురపాలక సంఘంలో కొన్ని రోజులుగా బాహుదా నదిలో నీరు లేక ప్రజలు పడుతున్న తీవ్ర ఇబ్బందిని కమిషనర్ ఎన్.రమేష్ గుర్తించారు. నీటి సమస్య పరిష్కారానికి ఒడిశా రాష్ట్రం చీకిటి ఎమ్మెల్యే మనోరంజన్ ద్యాన సమంతరాని మంగళవారం కలిసి కొంత నీటిని దిగువకు విడుదల చేయాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ భగలోట్టి డ్యాంలో గతేడాది కన్నా నీటి సాంద్రత తక్కువ ఉందన్నారు. నీటి మట్టం పెరిగిన వెంటనే తప్పక విడుదల చేస్తామని హామీనిచ్చారని తెలిపారు. తాగునీటి సరఫరాకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామీణ నీటి సరఫరా అధికారులతో మాట్లాడామన్నారు. గ్రామీణ నీటి సరఫరా చేస్తున్న పైపులైన్ నుంచి మున్సిపాలిటీకి చెందిన మంచి నీటి ఊట బావికి కనెక్షన్ ఇచ్చి నీటి సరఫరాకు గట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.


చీకిటి ఎమ్మెల్యేతో కమిషనర్ రమేష్

లక్ష్యసాధనలో విద్యార్థులు శ్రమించాలి


సన్మానిస్తున్న సూరిబాబు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రతి విద్యార్థీ తన జీవిత గమనాన్ని మార్చుకునేందుకు పాఠశాల వేదికగా ఎంచుకుని శ్రమించాలని, అప్పుడే అనుకున్న లక్ష్య సాధనకు వీలవుతుందని విశ్రాంత డిఇఒ బలివాడ మల్లేశ్వరరావు అన్నారు. నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో సోమవారం రాత్రి శర్వాణి విద్యాలయ వార్షికోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. శర్వాణి విద్యాలయ అధినేత అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సహకారం, విద్యార్థుల శ్రమ వల్లే అనేక మంది పూర్వ విద్యార్థులు ఉన్నత స్థానాలు పొందారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శర్వాణి విద్యాలయ హెచ్‌ఎం కె.రేఖ, కరస్పాండెంట్ ఎ.ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఘటాల పండగ

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణ ఇలవేల్పు పాలపోలమ్మ తల్లి ఘటాల పండగను ఘనంగా నిర్వహించారు. పురపాలక సంఘంలోని 16వ వార్డు పరిధిలోని డాబాలవారివీధి కూరగాయలు మార్కెట్ శివన్నారాయణ క్వార్టర్స్ వరదావారి క్వార్టర్స్ ప్రాంత మహిళలు కలశాలతో ఊరేగింపుగా వెళ్లారు. పులివేషాలు, తప్పెటగుళ్లు, జానపద నృత్యాలతో కోలాహలంగా ఘటాల ఊరేగింపు చేపట్టారు. పోలీసులు ముందస్తు చర్యలలో భాగంగా వన్ వే ఏర్పాటు చేసి వాహనాలను కంచరపేట, తహశీల్దార్ కార్యాలయం, మోజింగి వారి వీధి మీదుగా మళ్లించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.


కోలాహలంగా సంబరాలు

కవిటి: కవిటి చింతామణి అమ్మవారి సంబరాలు కోలాహలంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ట్రాక్టర్ యూనియన్ సభ్యులు మంగళవారం మేళతాళాలు, కాళికా నృత్యాలతో సంబర మహోత్సవం నిర్వహించారు. ఈ వేడుకలో యూనియన్ సభ్యులు, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల సంక్షేమ సారథి చంద్రబాబు

కోటబొమ్మాళి: నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి నిరంతరం పాటుపడిన వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడని నాయీబ్రాహ్మణుల జిల్లా ఉపాధ్యక్షుడు సౌగాపు నాగరాజు అన్నారు. మేరకు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. సిఎం నాయీబ్రాహ్మణులకు ఇచ్చిన హామీలు ఒకొక్కటిగా నెరవేర్చి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నారని అన్నారు. అందులో భాగంగానే ఆలయాల్లో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులకు కనీస వేతనం రూ.20వేలు నుంచి రూ.25వేలకు పెంచుతూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. నాయీబ్రాహ్మణులంతా టిడిపితో ఉన్నందుకు వారిని ముఖ్యమంత్రి గుర్తించి న్యాయం చేశారన్నారు. సిఎం, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు.


నాగరాజు


నివాళ్లర్పిస్తున్న విద్యార్థులు

అశ్రు నివాళి

ప్రజాశక్తి- కవిటి

జమ్మూ- కాశ్మీర్ లోని పెహల్గాం దగ్గర పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి కవిటి మండలం వై.జి.పుట్టుగ ఎంపిపిఎస్ విద్యార్థులు సోమవారం రాత్రి ఘన నివాళ్లర్పించారు. విద్యార్థులు కొవ్వొత్తులు వెలిగించి మృతులకు అంజలి ఘటించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవదాస్ మాట్లాడుతూ యావత్ దేశం బాధితులకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మాజీ సైనిక ఉద్యోగుల ఆధ్వర్యాన కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘ భవనం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. ఉగ్రవాదం నశించలంటూ నినాదాలతో హోరెత్తించారు.


పట్టువస్త్రాలను సమర్పిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

అమ్మవారికి పట్టువస్త్రాలు

ప్రజాశక్తి- పాతపట్నం

స్థానిక నీలమణి దుర్గ అమ్మవారి ఆలయంలో 50వ వార్షికోత్సవ ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ శరన్నవరాత్రి ఉత్సవాలు తొమ్మిది రోజులు పాటు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కుటుంబ సభ్యులతో పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ టి.వాసుదేవరావు, టిడిపి మండల అధ్యక్షులు సైల బాబ్జి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మీడియం వారీగా టీచర్ పోస్టులు కేటాయించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రభుత్వ పాఠశాల బలోపేతం చేయడానికి మోడల్ మోడల్ ప్రాథమిక పాఠశాలలు తెచ్చామని ప్రభుత్వం చెపుతున్నా... మీడియం వారీగా తరగతి గదుల్లో ఉపాధ్యాయుల సంఖ్యను పెంచకపోవడంతో విద్యా వ్యవస్థ కుంటుపడుతుందని ఎస్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వి.రమణమూర్తి, జి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ పాఠశాలల విధానం వల్ల ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేసి నాణ్యమైన విద్య అందించాలని కోరారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన బైలింగ్వల్ పాఠశాలల్లో మీడియం వారీగా పోస్టులు కేటాయించకపోతే విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందన్నారు. ఒకే మీడియం మాదిరిగా పోస్టులు కేటాయించడం వల్ల పిల్లలు బోధన కుంటుపడుతుందన్నారు. పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలు ఎలా మెరుగు పడతాయని ప్రశ్నించారు. పోస్టులు రద్దు ఆలోచనలు మాని ఇప్పటికైనా మీడియం వారిగా పోస్టులు కేటాయించాలని కోరారు.

బాలకృష్ణకు అభినందనలు

టెక్కలి : సినీనటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు అందుకోవడంపై టెక్కలి సుదర్శన్ థియేటర్ యజమాని సత్తారు వెంకటరమణ ఒక ప్రకటనలో అభినందించారు. సినీరంగంలో పలు రకాల నటనలతో ప్రేక్షకులను మెప్పించి సినీ ప్రపంచంలో తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో థియేటర్ మేనేజర్ ఎస్.బాలకృష్ణ, వెంకటేష్, జానీ థియేటర్ సిబ్బంది పాల్గొన్నారు.